క్లుప్తంగా

గాలికుంటు నివారణకు టీకా



టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీడీ

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణకు టీకా కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకుడు జి.వెంకటేష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వీరాంజనేయకొట్టాల గ్రామంలో పశువైద్య సహాయకులు నిర్వహిస్తున్న గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ప్రస్తుతం పశు బీమా పథకం అమలులో ఉందని, పశువులకు బీమా చేయించుకోవాలన్నారు. గొర్రెలు, మేకల కాపరులు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు ఎర్రిస్వామి, రవితేజ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

17న ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట

కణేకల్లు: కణేకల్లు క్రాస్‌లో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 17న స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరగనుంది. ఆలయంలో మూడ్రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు చేయనున్నారు. 15న గంగ పూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, రుద్రాభిషేకం, మంగళారతి పూజలు నిర్వహించనున్నారు. 16న ధ్వజస్తంభ ప్రతిష్టాపన, శిఖర కలశ ప్రతిష్ట, గణపతిహోమం, రుద్రహోమాలతో పాటు పలు కార్యక్రమాలు జరుగనున్నాయి. 17న వేకువజాము 4 నుంచి 4.30 గంటల మధ్య వేదపండితు మంత్రోచ్చారణ నడుమ ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

యూరియా నీరుతాగి గొర్రెల మృతి



మృతి చెందిన జీవాలు

రాయదుర్గంటౌన్: కదరంపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం యూరియా కలిపిన నీరు తాగి 10 జీవాలు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న వైఖ వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని వైద్యం అందించి, పది గొర్రెలను కాపాడారు. మృతి చెందిన వాటిలో గోవిందుకు చెందిన 4 గొర్రెలు, నాగరాజుకు చెందిన రెండు గొర్రెలు, ఒక మేక, రామన్నకు చెందిన గొర్రెలు, ఒక మేక మొత్తం 10 జీవాలు మృతి చెందాయన్నారు. పశువైద్య సిబ్బంది మేఘన, రాఘవేంద్ర, దయానంద పాల్గొన్నారు.

ఎస్‌ఐకి వైఎస్సార్‌సీపీ నాయకుల సన్మానం



ఎస్‌ఐ నాగమధును సన్మానిస్తున్న నాయకులు

కణేకల్లు: సొల్లాపురంలో చోరీకి గురైన సీతారామాలయ నిర్మాణ డబ్బు రికవరీలో శ్రద్ధ కనబరిచిన ఎస్‌ఐ నాగమధును వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సన్మానించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ నాగమధుతోపాటు పోలీసులకు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసులు, నాయకులు హళ్లి నాగరాజు, ఆదిసద్గురు చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న సర్మస్, నేసే రఘు, నాగరాజ సన్మానించారు. ఈనెల 4న రూ.12 లక్షలు చోరీ కాగా, వారం రోజుల్లోపు పోలీసులు దొంగలను పట్టుకున్నారు.

మహిళా పోలీసు మృతి

ఉరవకొండ: మండల పరిధిలోని వై.రాంపురం గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పని చేస్తున్న నర్మద (35) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలు నర్మదకు భర్త రాకేష్, కొడుకు, కుమార్తె ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కూడేరు: గ్రామవార్డు, సచివాలయాల హెల్త్ సెక్రటరీ గ్రేడ్–3 సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7న తమ అసోసియేషన్ ప్రతినిధి బృందం విజయవాడలో వైద్య ఆరోగ్య శాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు. 20న విజయవాడలో గ్రామ, వార్డు, సచివాలయ హెల్త్ సెక్రటరీ గ్రేడ్–3 సిబ్బంది తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టబోవు ధర్నాకు తమ అసోసియేషన్ సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

చూడి గొర్రెలకు సీమంతం

బెళుగుప్ప: నరసాపురం గ్రామంలో గొర్రెలకు శుక్రవారం సీమంతం నిర్వహించారు. పోషకాహారం గ్రోవి ఫ్లెక్స్, టానిక్కులు, పలు మందులను విర్బక్ కంపెనీ తోడ్పాటుతో కాపరులకు ఉచితంగా పంపిణీ చేశారు.

అంతా మా ఇష్టం



తిప్పనపల్లి గ్రామ సచివాలయం



కైరేవులో రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు

- ఎప్పుడొస్తారో తెలీదు.. ఎక్కడుంటారో చెప్పలేం
- సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది
- సగానికిపైగా పంచాయతీల్లో ఇన్‌చార్జులే..
- సర్వేలు, ఫీల్డ్ విజిట్‌ల పేరిట కాలక్షేపం
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పట్టించుకోని అధికారులు

శెట్టూరు: పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు.. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పత్తాలేకుండా పోతున్నారు. విధులకు ఎప్పుడొస్తారో తేలీదు.. ఎక్కడుంటారో చెప్పలేం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఉదయం 10 గంటలకు హాజరుకావాల్సి ఉన్నా.. 11.30 గంటలైనా సచివాలయాల్లో కనిపించలేదు. సగానికిపైగా పంచాయతీల్లో ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. ఉన్నవారు కూడా సర్వేలు, ఫీల్డ్ విజిట్‌ల పేరిట కాలక్షేపం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

సగానికి పైగా పంచాయతీల్లో ఇన్‌చార్జ్‌లే..

నియోజకవర్గంలోని ఎక్కువ శాతం గ్రామ పంచాయతీల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కార్యదర్శులు ఇన్‌చార్జులే కొనసాగుతున్నారు. కుందుర్పి, కంబదూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో సగానికి పైగా పంచాయతీలకు కార్యదర్శులు లేరు. ఇతర పంచాయతీల కార్యదర్శులే ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇన్‌చార్జ్‌గా ఉన్న పంచాయతీల్లో పాలన అంతంతమాత్రంగా ఉంది.

సర్వేల పేరిట బయటే..

గత ఎనిమిది నెలలుగా గ్రామ సచివాలయం నుంచి పెన్షన్ పంపిణీ తప్పా ఎలాంటి సంక్షేమ పథకాలూ అందలేదు. సచివాలయ ఉద్యోగులకు కచ్చితమైన జాబ్‌చార్ట్ ఇవ్వలేదు. కానీ సుమారు 6 రకాల సర్వేలు (జియో ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వే, పీపీసీఎస్ సర్వే, నాన్ రెసిడెన్స్ ఆఫ్ ఏపీ, ఆధార్‌లేని 0 టూ 6 ఏళ్ల పిల్లల వివరాల సర్వేలు ఇవేకాక పీ– 4 సర్వేలను) సిబ్బందికి ఇచ్చారు. ఈ సర్వేల పేరుతో సిబ్బంది సచివాలయంలో లేకుండా బయటే ఉంటున్నా సర్వేల్లో మాత్రం ఎలాంటి పురోగతి ఉండడం లేదని తెలుస్తోంది. ఇప్పటికీ గ్రామాల్లో మిస్సింగ్ సిటిజన్, ఆధార్ లేని పిల్లల వివరాలు పూర్తి స్థాయిలో తెలియదంటే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఇక సచివాయానికి, ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ఎంఎల్‌హెచ్‌పీలు ఏం విధులు నిర్వర్తిస్తున్నారో అర్థం కావడంలేదు. ఎంఎల్‌హెచ్‌లపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో వారు ఎప్పుడు విధులకు వెళ్తారో.. ఎక్కడుంటారో తెలియడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గంలో సచివాలయాలు, సిబ్బంది వివరాలు..

మండలం	గ్రామ పంచాయతీలు	ఇన్‌చార్జ్‌ల సంఖ్య
కళ్యాణదుర్గం	17	01
శెట్టూరు	16	03
కుందుర్పి	13	07
బ్రహ్మసముద్రం	16	08
కంబదూరు	12	09

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు..

పంచాయతీల్లో ఎంపీడీఓల, డీఎల్‌డీఓల పర్యవేక్షణ లేకనే సిబ్బంది పనితీరు ఇలా ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడో ఒకసారి పర్యవేక్షణకు వచ్చే డీఎల్‌డీఓ మండల కేంద్రంలోని సచివాలయాలు, పట్టణానికి సమీపంలోని సచివాలయాలు మాత్రమే పర్యవేక్షిస్తున్నారు. బోర్డర్‌లో ఉన్న కనుకూరు, తిప్పనపల్లి, పెరుగుపాళ్యం, బైరావానతిప్ప, పడమటి కోడిపల్లి, ఎరిడికేర, కురాకుపల్లి, రాళ్ల అనంతపురం, కర్తనపర్తి, రాంపురం, గొల్లపల్లి, ఎర్రగుంట, జంబుగుంపుల, ఎనుములదొడ్డి వంటి పంచాయతీల్లో నేటికీ పర్యవేక్షణ లేదు. దీంతో ఇక్కడి సిబ్బంది లేక కార్యాలయాల్లో కుర్చీలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఎంపీడీఓలు సిబ్బంది హాజరును ఆన్‌లైన్‌లోనే చూస్తున్నారు తప్ప క్షేత్రస్థాయికి వెళ్లడంలేదు.

సిబ్బంది ఉండడంలేదు



శెట్టూరు మండల కేంద్రంలోని సచివాయంలో డిజిటల్, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు స్థానికంగా ఉండడం లేదు. దీంతో పొరుగున ఉన్న చింతర్లపల్లి, అయ్యగార్లపల్లి సచివాలయాలకు సేవలకు వెళ్లాల్సి వస్తోంది. 1బి, అడంగల్ కోసమని సచివాలయం వెళ్తే అక్కడ ఇచ్చేవారు ఉండడం లేదు. అందువల్లే ఇతర సచివాలయ వద్దకు వెళ్తున్నాం. వ్యయప్రయాసలు పడాల్సి వస్తోంది.

– నరసింహ, శెట్టూరు

ఇన్‌చార్జ్‌ల పాలన పోవాలి



కంబదూరు మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉంటే డీడీఓలు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఒక్కో కార్యదర్శి మూడు గ్రామాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు. దీంతో పాలన కుంటుపడుతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రతి పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శులను నియమించాలి.

– హనుమంతరాయుడు, కంబదూరు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కల్యంకు చెందిన వన్నూరుస్వామి



గాయపడిన కార్మికుడు పప్పుకుమార్

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు ఎక్స్‌ప్రెస్ తోట వద్ద బళ్లారి రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. కర్ణాటకలోని నాయకనహట్టి దేవస్థానానికి కాలినడకన బయల్దేరిన కల్యంకు చెందిన ఇద్దరిని వెనుక వైపు నుంచి టూవీలర్ ఢీకొనింది. డి.హీరేహాళ్ మండలం కల్యంకు చెందిన ఆచారి వన్నూరుస్వామి, కె.వన్నూరుస్వామి ఇద్దరు శుక్రవారం సాయంత్రం పాదయాత్రగా దేవస్థానానికి బయల్దేరారు. చదం గ్రామం వద్ద రైల్వే లైన్ పనులు చేస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కార్మికులు పప్పుకుమార్, జయప్రకాష్, బంద్‌నాథ్ ద్విచక్రవాహనంపై రాయదుర్గం వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పాదయాత్రగా వెళుతున్న ఇద్దరినీ పట్టణ సమీపంలో బళ్లారి రహదారిపై ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ప్రమాదంలో ఆచారి వన్నూరుస్వామితోపాటు స్కూటర్‌లో ఉన్న ముగ్గురు యూపీ వాసులకు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురు యూపీ యువకులు మద్యం సేవించి అతివేగతంతో వచ్చి ఢీకొన్నట్లు బాధితులు తెలిపారు. క్షతగాత్రులను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. ఈ ప్రమాదంలో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కూలీలకు ‘ఉపాధి’ పనులు కల్పించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ఉరవకొండ: వలసలు నివారించి, కూలీలకు ఉపాధి కల్పించాలని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కేశవరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వారి సమస్యలను రైతు సంఘం నాయకులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనంతపురం బైపాస్ వద్ద ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 31 మండలాల్లో 425 గ్రామ పంచాయతీలో వ్యవసాయ పనులు లేనందున దాదాపు 42 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారన్నారు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ ఎదుర్కోవాలన్నారు. ఉపాధి పనులు లేక పొట్టకూటి కోసం జిల్లాకు చెందిన కూలీలు తమిళనాడు, బెంగళూరు, కేరళ రాష్ట్రాలకు వలస పోతున్నారని తెలిపారు.

హోలీ సంబరాలు ఎక్కడ బాబూ?

బ్రహ్మసముద్రం : అయ్యా సురేంద్రబాబూ.. గతేడాది సార్వత్రిక ఎన్నికలప్పుడు ఓట్ల కోసం హోలీ పండుగ సమయంలో తండాల్లోకొచ్చి అలవిగాని హామీలిచ్చారు..అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు.. హోలీ సంబరాలు నిర్వహిస్తామన్నారు.. అధికారంలోకొచ్చిన తర్వాత పత్తా కనిపించలేదు. కేవలం ఓట్ల కోసం వాడుకున్నారని గిరిజనులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును నిలదీశారు. శుక్రవారం మండలంలోని బొమ్మగానిపల్లి వంక తండావాసులు గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నించారు. బొమ్మగానిపల్లి వంక తండాకు చెందిన కాశీరాం నాయక్, సురేంద్ర నాయక్, రాజునాయక్, కోట్రేష్ నాయక్, నగేష్‌నాయక్ తదితరులు మాట్లాడుతూ కేవలం కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే సురేంద్రబాబు గిరిజనులను ఓట్లకోసమే వాడుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేకు గిరిజనులపై కపట ప్రేమ మాత్రమే ఉందని, ఎన్నికల హామీలో భాగంగా గిరిజన తండాల్లో హోలీ సంబరాలు ఎందుకు నిర్వహించలేకపోయారని విమర్శించారు. గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిన ఎమ్మెల్యేకు భవిష్యత్‌లో జరిగే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

నియమ నిష్టలతో ఉపవాస దీక్ష చేయాలి



టిప్పు మసీదులో సామూహిక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

రాయదుర్గంటౌన్: నియమ నిష్టలతో ఉపవాస దీక్ష చేయాలని హఫీజులు, మౌలానాలు తెలిపారు. పట్టణంలోని మసీదులు ముస్లింలతో కిక్కిరిశాయి. పట్టణంలో మొత్తం 28 మసీదులు ఉండగా, శుక్రవారం ప్రత్యేక జోహార్ నమాజ్‌కు పెద్ద ఎత్తున ముస్లిం హాజరై సామూహిక ప్రార్థనలు చేశారు. రాత్రి ఇషా నమాజ్ తరువాత ప్రత్యేక తరావీ నమాజ్ (ఖురాన్ పఠనం)ను కూడా ముస్లిం ఎంతో భక్తిశ్రద్ధలతో హాజరవుతున్నారు. ఈ తరావీ నమాజ్ కోసం ఇతర ప్రాంతాల నుంచి హఫీజ్‌లను పిలిపించి బోధనలు చేయిస్తారు.

వైభవంగా భంభంస్వామి షంషీర్ ఉత్సవం



రాయదుర్గంలో షంషీర్ ఉత్సవాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మహాయోగి భంషేక్ అబ్దుల్‌వహాబ్ స్వాముల (భంభంబాబా) 56వ ఉరుసులో భాగంగా శుక్రవారం స్వామి వారి షంషీర్ (బ్రహ్మోత్సవం) నిర్వహించారు. తెల్లవారు జామున గుర్రంపై స్వామి వారి షంషీర్ ఉత్సవాన్ని పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఆత్మకూరు వీధి, కోట, వినాయక సర్కిల్, పాతబస్టాండ్, లక్ష్మీబజార్, కణేకల్లు రోడ్డు మీదుగా ఊరేగింపు దర్గాకు చేరింది. తెల్లవారు జాము 4 గంటలకు ప్రారంభమైన షంషీర్ ఊరేగింపు ఉదయం 10 గంటలకు దర్గాకు చేరుకుంది. భంభంస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామి వారి జియారత్ కార్యక్రమం జరిగింది.

అయోడిన్ లోపిస్తే ఆరోగ్య సమస్యలు

- ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య

కూడేరు: అయోడిన్ లోపిస్తే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ దరగయ్య తెలిపారు. శుక్రవారం కరుట్లపల్లిలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ న్యూ ఢిల్లీ ఆధ్వర్యంలో ఐటీసీ సహకారంతో పోషణ మేళా నిర్వహించారు. స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార కిట్లను అందజేశారు. అనంతరం జిల్లా కో ఆర్డినేటర్ దరగయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబుళమ్మ, ఐజీడీ సిబ్బంది సుదర్శన్ రెడ్డి, మహమ్మద్, పోతులయ్య, రహేన, రమణమ్మ, ఆశా వర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలోని ప్రసిద్ధి చెందిన అక్కమాంబ ఆలయ హుండీ కానుకలను శనివారం లెక్కించనున్నారు. దేవదాయ శాఖ అధికారులు, ఒంటిమిద్ది, కురాకుల తోట, దేవాదులకొండ గ్రామాల ప్రజల సమక్షంలో కానుకలు లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాము ఓ ప్రకటనలో తెలిపారు.

బెస్తరపల్లి కొండకు నిప్పు

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి అటవీ ప్రాంతానికి గురువారం సాయంత్రం గుర్తు తెలియని వారు నిప్పు పెట్టారు. దీంతో అటవీ ప్రాంతంలోని చెక్కన కొండ, బూడిగుండ్లు, నడుంబీడు, రెప్పప్పచేను బయలు తదితర ప్రాంతాలకు చెందిన అటవీ ప్రాంతం వెయ్యి ఎకరాలకు పైగా కాలిపోయింది. మూడు నెలలుగా సిబ్బంది లేక పోవడంతో తరచూ అడవులకు ఆకతాయిలు నిప్పు పెట్టి పచ్చదనాన్ని బుగ్గిపాలు చేస్తున్నారు. కళ్యాణదుర్గం రేంజర్ మధుబాబు మట్లాడుతూ త్వరలోనే సిబ్బందిని నియమించి అడవుల సంరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా మహాలక్ష్మిదేవి జయంతి



అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం పెన్న హోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయం కింది భాగంలో స్వయంభువుగా వెలసిన శ్రీ ఉద్భవ లక్ష్మీదేవి ఆలయంలో మహాలక్ష్మి జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు.అమ్మవారి ఆవిర్భవించిన రోజు కావడంతో మూలవిరాట్‌కు ప్రధాన అర్చకుడు బాలాజీ స్వామి 108 లీటర్ల పాలతో అభిషేకం చేశారు. శ్రీ సూక్తం,అభిషేకం, తోమాల సేవ,తామరపూలతో అర్చన, వివిధ రకాల పూలతో అమ్మవారిని అలంకరించారు.

16న గురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణానికి 45 కిలోమీటర్ల దూరంలో మధ్య కర్ణాటకలో ప్రసిద్ధిగాంచిన చెళ్లికెర తాలూకా నాయకహట్టిలో వెలసిన శ్రీగురు తిప్పేరుద్రస్వామి రథోత్సవం ఈ నెల 16న నిర్వహించనున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని నలువైపుల నుంచి స్వామి వారి జాతరకు ఏటా వేలాది మంది భక్తులు తరలివెళ్తారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం జరగనుంది. జాతరకు కేఎస్ఆర్టీసీ ప్రత్యేకంగా సర్వీసులు నడపనుంది. రాయదుర్గం నుంచి ప్రత్యేకంగా ప్రైవేట్ బస్సులు నడపనున్నారు.

గడ్డివాములు దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురంలో శుక్రవారం గడ్డివాములు, వేరుశనగ పొట్టు కాలిపోయింది. కురుబ నాగప్పకు చెందిన 10 ఎకరాల వరిగడ్డి, రాయపురం వన్నూరుస్వామికు చెందిన 2.5 ఎకరాల వేరుశనగ పొట్టు గ్రామ శివారులో గడ్డివాములు వేసుకున్నారు. సుమారు రూ. 2 లక్షలు నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

విడపనకల్లు: పాల్తూరులో గడ్డివాము దగ్ధమైంది. సంజీవ్ అనే రైతుకు చెందిన గడ్డివాముకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. రూ.2లక్షలు నష్టపోయినట్లు బాధితులు తెలి పారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

కూడేరు: దుకాణాలు, ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా చోరీలను అరికట్టొచ్చని సీఐ రాజు అన్నారు. శుక్రవాం సీఐ రాజు తన సిబ్బందితో కూడేరు బస్టాండ్‌లో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణదారులతో మాట్లాడారు. ప్రతి దుకాణాదారుడు సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామానాయుడు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నిఘా నేత్రాల నడుమ పది పరీక్షలు

కూడేరు: ఈ నెల 17 నుంచి పదోతరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లా విద్యాధికారులు కూడేరు జెడ్పీహెచ్ఎస్ కేంద్రాన్ని సమస్యాత్మక కేంద్రంగా గుర్తించారు. పకడ్బందీగా పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టారు. శుక్రవారం కూడేరు హైస్కూల్లో పది పరీక్షలు నిర్వహించే తొమ్మిది గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలో కమ్మూరు హైస్కూల్ నుంచి 13 మంది, కూడేరు 127, జల్లిపల్లిలో 33, మరుట్ల–2 నుంచి 36, కొర్రకోడు నుంచి 15 , కరుట్లపల్లి నుంచి 36, కేజీబీవీ నుంచి 39 మంది చొప్పున మొత్తం 299 మంది పది పబ్లిక్ పరీక్ష రాయనున్నారు. 200 మందికి హైస్కూల్‌లో మిగిలిన వారికి కేజీబీవీలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

‘అనంత’ తాగునీటి పైపులైన్‌కు లీకేజీ

కూడేరు: మండలం జల్లిపల్లిలో పీఏబీఆర్ డ్యాం నుంచి అనంతపురం నగర ప్రజలకు సరఫరావుతున్న తాగునీటి పైపులైన్ ఎయిర్ వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడింది. దీంతో పెద్ద ఎత్తున నీరు లీకవుతోంది. ఆ నీరంతా వృధాగా పారుతూ ఇళ్ల సమీపాన చేరి అపరిశుభ్రత నెలకొంది. ఈ తంతు గత కొద్ది రోజులుగా కొనసాగుతోంది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సమాజంలో స్త్రీల సేవలు అపరమితమన్నారు. గ్రామాల్లో జరుగుతున్న బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. ఆర్థికంగా, సామాజికంగా మహిళలు సాధికారతను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, సీబీటి నాగరాజు, రాజు, మహిళలు పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

రాయదుర్గంటౌన్: నాటు సారా తయారు చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కెంచానపల్లి గ్రామంలో నాటు సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ పవన్, సిబ్బంది, గ్రామ పెద్దలు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కంబదూరు: సారా రహిత మండలంగా తీర్చిదిద్దుదామని ఎక్సైజ్‌శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని రాళ్ల అనంతపురం, నూతిమడుగు గ్రామాల్లో నవోదయం–2 కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలన కోసం గ్రామ సభలు నిర్వహించారు. నాటుసారా తాగడం వలన కలిగే అనర్థాలు, నష్టాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జయనాథ్‌రెడ్డి, కంబదూరు సీఐ సునీల్‌కుమార్, ఎస్‌ఐలు శ్రీనివాసులు, ప్రవీణ్, సర్పంచ్‌లు రాజగోపాల్, అమర్ పాల్గొన్నారు.

భంభం బాబా ఆరాధనోత్సవం



కుందుర్పిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంతో పాటు కలిగొలిమి, తెనగల్లు, అప్పిలేపల్లి, మహంతపురం తదితర గ్రామాల్లో శుక్రవారం సద్గురు అన్వరానంద బాబా 22వ ఆరాధనోత్సవాలు నేత్ర పర్వంగా సాగాయి. ఉదయం ఆయా గ్రామాల్లో భంభంబాబా చిత్ర పటాలను ట్రాక్టర్లలో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కబీర్ కిరణ్‌స్వామి తదితరులు హాజరై భక్తులకు ఉపదేశాలు అందించారు.

బంగారు నంది అవార్డు గ్రహీతకు సన్మానం



మాట్లాడుతున్న సన్మాన గ్రహీత ఉమ్మల చంద్రశేఖర్

వజ్రకరూరు: మండలంలోని గంజికుంటలో శుక్రవారం బంగారు నంది అవార్డు గ్రహీత,ఎస్సీ,ఎస్టీహక్కుల పరిరక్షణ సమితి సత్యసాయి జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ఉమ్మల చంద్రశేఖర్‌ను శుక్రవారం సన్మానించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ ఉమ్మల చంద్రశేఖర్ ఉపాధ్యాయుడిగా అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు ఓబన్న, సామాజిక కార్య కర్త శ్యాం ప్రసాద్, ఆర్టీటీ ఏటీఎల్ దేవరాజు, నిర్వాహకులు సోమప్ప, ఎర్రిస్వామి, సుంకన్న, దేవపుత్ర, తిమ్మప్ప, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు గుడిసి రవీంద్ర, ఎంఈఓ ఎర్రిస్వామి, సూపరింటెండెంట్ భాస్కర్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు సాకే భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ పండుగ



రంగులు చల్లుకుంటూ హోలి జరుపుకుంటున్న బాలికలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో శుక్రవారం హోలీ పండుగను చిన్నారులు, పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. బాలికలు, చిన్నారులు పట్టణవీధుల్లో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. పట్టణంలో లక్ష్మీబజార్, నేసేపేటతోపాటు వివిధ కాలనీల్లో సరదాగా రంగులు చల్లుకొని హోలీ నిర్వహించారు.

గుమ్మఘట్ట: మండలంలోని పలు గ్రామాల్లో హోలీ పండుగను శుక్రవారం ఘనంగా జరిపారు. రంగులను చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.



గోనబావిలో హోలీ పండుగను జరుపుకుంటున్న యువకులు